# మనసున మల్లెలు

"మనసున మల్లెల మాలలూగెనే..." తనకిష్టమైన పాటని మెల్లగా రాగం తీస్తూ క్రొత్తచీరె కట్టుకోవటం పూర్తిచేసింది వసంత. నిలువుటద్దంలో రెండుసార్లు అటూఇటూ తిరిగి చూసుకుంది. జరీబుటాలున్న నెమలికంఠం రంగు వెంకటగిరిచీరె తనకి చాలా బావుందనుకుంది.

కిందటి సంవత్సరం పుట్టింట్లో ఉంది కాబట్టి ఆరోజు తనబర్త్‌డే అని విహారికి తెలియదు. ఇపుడు తెలియగానే "ఏం ప్రెజెంటేషన్ కావాలీ?" అనడిగితే ఏం చెప్పాలీ అని ఆలోచనలు మొదలు పెట్టింది. ముత్యాల గొలుసు, చంద్రహారం అని అడిగితేసరి! అతను ఆశ్చర్యంతో నోరు తెరిచేస్తే అపుడు నిదానంగా చెప్పాలి! "కంగారు పడకండి. మీరు సెలవుపెట్టి ఈ రోజంతా నాతో గడపటమే మీరు నాకివ్వాల్సిన బహుమతి! నేను వంటచేస్తోన్నా, ఏ పనిచేస్తున్నా ప్రక్కప్రక్కనే ఉండి కబుర్లు చెప్పాలీ, వినాలీ! ఆశ్చర్యంగా ఉందా? ఇంట్లో ఇద్దరం ఉంటున్నాగానీ నేనెంత ఏకాంతం అనుభవిస్తున్నానో మీకర్థం కావటంలేదు.

నాకు చిన్నప్పటి నుండీ చదివిన పుస్తకం, చూసిన సినిమా గురించీ, నాకు నచ్చినవీ, నచ్చనివీ ఇలా అన్ని విషయాలూ ఇంట్లోవాళ్ళతో, నాకిష్టమైన స్నేహితులతో చెప్పుకోవటం, చర్చించటం అలవాటు. ఇపుడేమో మీ మౌనంతో నేనూ తప్పనిసరి మౌనవ్రతం పాటిస్తున్నాట్లుగా ఉంటోంది! ఇంటికి కావలసిన సరుకులు గురించో, మరే అవసరాల గురించో కాకుండా మనం సరదాగా మాట్లాడుకున్న సందర్భాలు ఎన్ని ఉన్నాయో గుర్తుకు చేసుకుని చెప్పండి! ఇరుగూ పొరుగూతో ఏవో కాలక్షేపం కబుర్లు చెప్పుకోవటం వేరూ, మనకిష్టమైన వాళ్ళతో ఇష్టంగా కబుర్లు చెప్పుకోవటం వేరూ! అవునా? ఆఫీసులో అవసరమేమో తెలియదుగానీ ఇంట్లోకూడా ఆఫీసరుమార్కు ఆ గంభీరముద్ర ఎందుకూ?

ఇపుడు మీకర్థమైందిగా, నేనడిగిందేమిటో? మీ మాటల మంచిముత్యాల పేరూ, చిరునవ్వుల చంద్రహారం అన్నమాట!"

ఈరోజు తన మనసులోని మాటలన్నీ ఇలా చెప్పేయాలనుకుంటూ అలమారాలోని దేముడిపటం ముందు దీపం వెలిగించి, కొబ్బరికాయకొట్టి దండం పెట్టుకుంది. అపుడే అటుగావచ్చిన విహారి అడిగాడు "పొద్దున్నే పూజమొదలుపెట్టావ్, ఈ రోజు పండుగేంకాదే?"

"కాకపోవడమేమిటీ, ముఖ్యమైన పండుగే, నా పుట్టినరోజు!" ఉత్సాహంగా చెప్పింది వసంత.

"ఓహో! నీకూ ఈ అలవాటు ఉందన్న మాట! మనం పుట్టి దేశాన్ని ఏం ఉద్ధరించామని పుట్టినరోజుని పండుగ చేసుకోవాలో నాకర్థంకాదు!" భుజాలెగురవేస్తూ అన్నాడు.

నవ్వుతూనే అయినా పాలపొంగులాంటి తన ఉత్సాహంపై నీళ్ళు చల్లినట్లుగా అన్న ఆ మాటలకి వసంత మనసు చివుక్కుమంది.

"దేశాన్ని ఉద్ధరించిన నాయకుల పుట్టినరోజు పండుగలను దేశమంతా జరుపు కుంటుంది. నా పుట్టినరోజు నాకూ, నావాళ్లకీ మాత్రమే పండుగ. నేను మానవ జన్మని పొందటాన్ని అదృష్టంగా భావిస్తాను. కాబట్టి, నేను పుట్టినరోజుని పండుగే అనుకుంటాను. తమ అనుబంధానికి చిహ్నంగా తమ మధ్యకి మరోప్రాణి రావటం ఆనందకరం కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లల పుట్టినరోజులను పండుగ అనుకుంటారు. జరుపుకుంటారు. ఇందులో మీకర్థంకాని విడ్డూరం ఏముందీ?"

వసంత అడగాలనుకున్న ఆ మాటలన్నీ గొంతులోనే ఉండిపోయాయి! అప్పటికే విహారి ముందుగదిలోకి వెళ్లి పేపరు తీసుకుని కూర్చున్నాడు. వసంత వెంటనే కొత్తచీరె మార్చేసి మామూలుచీరె కట్టుకుంది. తను కొత్తచీరె కట్టిన సంగతి అతనెప్పుడూ గమనించడు. ఇక అలాంటప్పుడు తను చీరె మార్చేసిందనీ, కోపం వచ్చిందనీ ఏం తెలుస్తుందీ అనుకుంటూ పనిలో పడింది.

తనకి సరదా, అలవాటు లేకపోవచ్చు. కానీ ఎవరి సరదాలు వాళ్ళవి అనుకుంటూ విహారి ఆఫీసుకు వెళ్ళేటప్పుడు వసంతని అడిగాడు. "సాయంకాలం వచ్చేటప్పుడు ఏం తీసుకురానూ, ఏం కావాలీ?" అని.

"ఇంట్లోనే అన్నీ ఉన్నాయి. ఏం అవసరంలేదు" అంది ముక్తసరిగా. అయినాసరే ఏదైనా తేవాలని ఆ క్షణం మనసులో అనుకున్నాడు గానీ సాయంకాలానికి ఆ విషయం మర్చిపోయాడు!

వసంతకి పెళ్లిఅయి రెండేళ్ళు అవుతోంది. విహారికి ఏ దురలవాట్లూలేవు. బుద్ధిమంతుడే. వాళ్ళకి ఆర్థికపరమైన ఇబ్బందులూ లేవు. సజావుగా సాగుతున్న సంసారమే. అయినా వసంత మనసులో అప్పుడప్పుడూ అసంతృప్తి చీకటి తెర రెపరెపలాడుతూనే ఉంటుంది.

భర్త బుద్ధిమంతుడైనంత మాత్రాన సరిపోదు. ఇంకేదో ఉండాలి! వ్యసనపరుడైన భర్తతో కంటె, తనపట్ల ఏ మాత్రం స్పందన చూపని భర్తతోనే భార్య ఎక్కువ అసంతృప్తి ఫీలవుతుందేమో!

మనిషితోడు ఉండీ, మాటతోడు లేకపోవటం! తనది చాలా చిత్రమైన సమస్య అని వసంత అనుకుంటూ ఉంటుంది. తనది ఎవరికీ చెప్పుకోలేని, చెప్పినా అర్థం చేసుకోవటానికి కష్టమైన కష్టం!

విహారి స్వతహాగా మితభాషి అనుకోవటానికి వీల్లేదు. అతను ఆఫీసులో ఎక్కువగా మాట్లాడతాడని వింది. ఇంటికి వచ్చిన స్నేహితులతోనూ గంటల తరబడి కబుర్లు చెప్పటమూ చూసింది. మరి ఇంట్లోనే ఎందుకంత మౌనంగా ఉండటం. బయట ఎక్కువగా మాట్లాడి ఆలసిపోయి ఇంట్లో ఆడవాళ్ళతో కబుర్లు ఏమిటనా? అతని ఉద్దేశం ఆమెకి అర్థంకాదు.

మొదట్లో తనంటే అంత ఇష్టం లేదేమోనని కూడా అనుకుంది. కానీ అది నిజం కాదని ఆడబడుచు పద్మ మాటలవల్ల తెలిసింది. ఒకసారి మాటల సందర్భంలో పద్మ చెప్పింది. పెళ్ళిచూపులకి తమ ఉళ్ళో ఇద్దరు అమ్మాయిలను చూడాలని వచ్చారట. ఇద్దరినీ చూశాక, ఆ తర్వాత అన్ని విషయాలూ ఆలోచించుకుని నిర్ణయించుకోవచ్చునని అనుకున్నారట. కానీ, తనని చూశాక విహారి ఇక ఆ రెండో అమ్మాయి వాళ్ళింటికి రానని ఖచ్చితంగా చెప్పేశాడట. "ఇద్దరినీ చూశాక, నీ ఇష్టప్రకారమే జరుగుతుందని నాన్నగారు అంటున్నారానంటున్నా వెందుకూ?" అని పద్మ అడిగితే "ఎందుకంటే, ఈ అమ్మాయి నాకు అంత బాగా నచ్చింది కాబట్టి. వాళ్ళు మనల్ని కాదంటే తప్ప మరో అమ్మాయిని చూడను" అని సమాధానం చెప్పాడట! ఆ విషయం పద్మ తనతో చెప్పినప్పుడు తనకెంత పులకింత కలిగిందనీ!!

విహారి ద్వారా ఆ మాటలు వింటే ఇంకెలా ఉంటుందో అనిపించింది వసంతకు. తనకెంతో ఇష్టమైన వాళ్ళ నుండి తనపట్ల గల ఇష్టాన్ని వినటం ఎవరికైనా ఇష్టమైన సంగతేమరి! అందుకే ఒకసారి వేసవికాలం వెన్నెల్లో డాబామీద పడుకున్నప్పుడు ఆ ప్రస్తావన తెచ్చింది.

ఆ వెన్నెల్లో... ఆకుల గలగలల నేపథ్యంలో... డాబాపైవరకూ పాకివచ్చిన జాజితీగ విరజిమ్ముతూన్న పరిమళాల అలల తాకిడి రేపేహాయిలో... తనపట్ల అతనికి కలిగిన ఇష్టాన్ని చెబుతోంటే ఇష్టంగా వినాలనీ, ఆ తర్వాత ఆ ప్రథమ సమావేశంలో తనలో కలిగిన తత్తరపాటునీ, నిశ్చయమవగానే కలిగిన తీయని అలజడినీ విడమరిచి చెప్పాలనీ అనుకుంది!

విహారి బద్ధకంగా ఆవులించి "ఈరోజు ఆఫీసులో పనెక్కువగా ఉండి అలిసిపోయాను. నిద్రొస్తోంది. అయినా ఎప్పుడో జరిగిపోయినవాటి గొడవ ఇప్పుడెందుకూ?" అంటూ అటు తిరిగి పడుకున్నాడు.

వసంతకు ఆశ్చర్యమేసింది! పదిగంటల సమయంలో పదినిముషాలపాటు నిద్ర ఆపుకోలేని వయసుకాదే! కబుర్లు చెప్పుకోవటం కూడా కష్టమేనా! రిలీఫ్‌గా అనిపించదా? మనసును మురిపించిన విషయాలను మళ్ళీమళ్ళీ నెమరువేసుకోవటంలోని మధురానుభూతి ఇతనికి అర్థంకాదా?! నిరాశగా నిట్టూర్చి నిద్రపోవటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ అర్ధరాత్రి వరకూ మేలుకునే ఉందారోజు.

ఒక సాయంకాలం విహారి ఉదయం చదవగా మిగిలిపోయిన సశేషాన్ని చదువుతూ పేపరు తిరగేస్తోంటే వసంత కాఫీ కప్పు అందించి తనూ ఎదురుగా కూర్చుంది. రెండు మూడుసార్లు ఏదో చెప్పబోతూంటే అతను పరధ్యానంగా పేపరులో నుండి తల కూడా ఎత్తకపోయేసరికి వసంతకు చిరాకొచ్చింది.

ఎదురుగా కూర్చున్న మనిషితో అందులోని వార్తల్నే ప్రస్తావిస్తూ చదువుకోవచ్చుగా! పరీక్ష చదువులా న్యూస్‌పేపరు కూడా అంత ఏకాగ్రతగా చదవాలా! చదువుకునే రోజుల్లో టెక్స్టుబుక్స్ ఇంకెంత ఏకాగ్రతగా చదవేవాడోమరి! అందుకే యూనివర్సిటీలో గోల్డ్‌మెడల్ వచ్చింది! రాకేంచేస్తుందీ! నిట్టూరుస్తూ అనుకుంది.

వసంత అక్కడ నుండి లేచి ఆ గదిలోనే ఉన్న టేబుల్ దగ్గరున్న కుర్చీలో కూర్చుని ఒక చిన్న నోట్‌బుక్‌లో తన ఆలోచలన్నీ రాయటం మొదలుపెట్టింది.

విద్యార్థిదశలో గోల్డ్‌మెడల్ సంపాదించటానికి ఎలా కృషిచేస్తారో సంసారంలో కూడా భార్యాభర్తలిద్దరూ ఒకరి నుండి ఒకరు గోల్డ్ మెడల్ పొందగలగాలి! తన సహచర్యాన్ని ఒక వరంగా, అదృష్టంగా ఎదుటి వాళ్ళు అనుకోగలిగితే వైవాహిక జీవితంలో గోల్డ్‌మెడల్ సంపాదించినట్లే! భార్యా భర్తలిద్దరి మధ్యా శారీరక సాన్నిహిత్యం కంటే మానసిక సాంగత్యమే ముఖ్యం! అటువంటి అపురూపమైన స్నేహబంధం ఏర్పడాలంటే ఇద్దరూ అప్పుడప్పుడూ అయినా అరమరికలు లేకుండా తమ ఆలోచనలను కలబోసుకుంటూ మనసారా మాట్లాడుకోగలగాలి!

విహారి తలెత్తిచూసి “ఏమిటీ రాస్తున్నావ్?” అనడిగాడు.

“మనబ్బాయికి పెళ్లి అయి కాపురం పెట్టబోతున్నప్పుడు కొన్ని మాటలు చెప్పాలని అనుకుంటున్నాను. అందుకని నా అనుభవాల నుండి నేర్చుకున్న పాఠాలను రాసి ఉంచుతున్నా” వసంత సీరియస్‌గా చెప్పింది.

విహారి నవ్వాడు. “చాలా బావుంది! ఇంకా ఆరునెలలకి పుట్టబోయే బిడ్డకి పెళ్ళివరకూ వెళ్ళిపోయావన్నమాట!” అంటూ పేపరులో మళ్ళా తలదూర్చేశాడు. వసంత నిట్టూర్చింది. “నీ అనుభవాలేమిటి? ఏమిటి నువ్వు కొడుక్కి చెప్పాలని అనుకుంటున్నది?” అని అతనడిగితే అప్పుడు తన మనసులోని మాటలు చెప్పాలని అనుకుంది.

“అమ్మాయికి పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళేముందు తల్లి అక్కడ అత్తమామల దగ్గర ఎలా అణకువగా ఉండాలో, భర్త మనసెరిగి ఎలా అనుగుణంగా నడుచుకోవాలో బుద్ధులు చెప్పటం సంప్రదాయంగా ఉంది. అలాగే అబ్బాయికి కూడా తల్లి కొన్ని మాటలు చెప్పాలని నా ఉద్దేశ్యం. ‘క్రొత్తజీవితంలో తన పాత అలవాట్లెన్నిటినో మార్చుకుని నీకు వేళకి అన్నీ అమర్చాలనీ, నీ ఇష్టాలకి విలువనిచ్చి అలా చేయాలనీ, ఆరాటపడే భార్య గురించి నీ అలవాట్లు కొన్నింటిని మార్చుకోవటానికి సిద్ధపడాలి! ఆమె ఇష్టాలేమిటో, ఆలోచనలేమిటో అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే ఇకరికి ఇద్దరం, ఇద్దరం ఒకరమే అనే ఆత్మీయత ఇద్దరిమధ్య పెరుగుతుంది’ అని మనబ్బాయికి చెప్పాలని అనుకుంటున్నాను. కొంతమందికి ఎవరూ చెప్పనక్కర్లేకుండానే తెలుస్తాయి. కానీ కొందరు చెబితేనేగానీ అర్థం చేసుకోలేని వాళ్ళుంటారుగా. అందుకని మా అత్తగారు చేయని పనిని నేను చేయాలనుకుంటున్నాను.”

చెప్పాలనుకునీ చెప్పలేకపోయిన ఆ మాటలకు అక్షరరూపం ఇవ్వటంలో వసంతకు తాత్కాలిక ఉపశమనం కలిగింది. ఆ తర్వాత అదొక అలవాటుగా మారింది. వసంత మనసులోని అసంతృప్తికి చిన్నచిన్న విషయాలే కారణాలవుతుంటాయి.

విహారి చదువుకునే రోజుల్లోని ఫ్రెండ్సు ఇద్దరు పెళ్ళికి వెళ్ళివస్తూ మధ్యలో అక్కడ ఆగుతామని తెలియజేశారు. ఆ ఊళ్ళోనే ఉన్న ఇంకొక స్నేహితుడూ నలుగురూ కలిసి రెండు మూడు రోజులు గడపాలని ప్రోగ్రాం వేసుకున్నారు. వాళ్ళు రావటానికి రెండు రోజుల ముందునుండే వసంత హడావుడి మొదలుపెట్టింది. ముందు రెండుగదుల్లో వాళ్ళకి పక్కలు ఏర్పాటు చేయటానికి వీలుగా సామాన్లన్నీ అటూఇటూ సర్దింది. ఇల్లంతా నీట్‌గా అమర్చి, పిండివంటలు చేసి ఉంచింది. వాళ్ళున్న మూడు రోజులూ భోజనంలోకి స్పెషల్సూ, టిఫిన్లూ చేయటం, అర్ధరాత్రి వరకూ కార్డ్సు ఆడుతూంటే టీ పెట్టివ్వటం, రాత్రిళ్ళు ఆలస్యంగా నిద్రపోయి పొద్దున్న పెందరాళే లేవాల్సిరావటంతో బాగా అలసిపోయింది వసంత.

వాళ్ళు వెళ్ళిన మర్నాడు పక్కమీద బద్ధకంగా పడుకుని అంది “బాగా అలసిపోయినట్లుగా ఉంది. ఒళ్ళంతా నొప్పులుగా కూడా ఉంది.”

“ఉండదూమరి! అలా ఇల్లంతా మార్చటం, నానా హైరానాపడటం ఇదంతా ఎందుకూ? నిన్నెవరు చేయమన్నారూ?” మందలింపుగా అన్నాడు.

విహారి మాటలకు వసంతకు కోపం వచ్చేసింది. దుప్పటిని విసురుగా తీసిపడేసి లేచింది.

“ఎవరూ చేయమనలేదు. నా బాధ్యత అనుకునే చేశాను. చేసినదానికి మంచిమాటలేదు సరికదా పైగా చిరాకొకటా!”

“ఎవరిపని వాళ్ళు చేసినదానికి పొగడ్తలు కావాలా!” అంటూ ముందుగదిలోకి వెళ్ళిపోయాడు.

వసంతకి కళ్ళు తడి అయ్యాయి. ప్రశంసకి అతిశయోక్తి శాతం ఎక్కువైతేనే పొగడ్త అవుతుంది. తనకి ప్రశంసకీ, పొగడ్తకీ తేడా తెలియదా?! ప్రశంస ఉత్సాహాన్నీ, ప్రోత్సాహాన్నీ అందిస్తుంది.

ఆ మధ్య హెడ్ ఆఫీసు నుండి ఇన్‌స్పెక్షన్‌కు వస్తున్నారని విహారి వారం రోజులు ఆఫీసుకు ఉదయమే వెళ్ళి రాత్రి తొమ్మిది గంటల వరకూ ఉండి పనిచేసి వచ్చేవాడు. పై ఆఫీసరు వచ్చినప్పుడు తనని పరిచయం చేస్తూ బ్రాంచి మేనేజరు తనని సిన్సియర్ అండ్ ఎఫిషియంట్ అని మెచ్చుకున్న సంగతిని తనతో ఎంత ఆనందంగా చెప్పాడూ?! ఇల్లాలికి మాత్రం చేసిన పనికి గుర్తింపు అక్కర్లేదా? తనని పొగడనవసరం లేదు. సందర్భాన్ని బట్టి "మేం సరదాగా గడిపితే, అన్నీ అమర్చిపెడుతూ నువ్వొక్కదానివీ చాలా అలసిపోయావు సుమా, ఈ రోజుకి రెస్టుతీసుకో" అని ఒక మాట అని ఉంటే తనకెంత తృప్తిగా ఉండేదీ! వసంత నిట్టూర్చి నిరాసక్తంగా పని మొదలుపెట్టింది.

వసంత ఒకసారి పుట్టింటికి వెళ్తూ రెండు వారాల్లో వస్తాననీ, వచ్చేముందు ఉత్తరం రాస్తాననీ చెప్పి వెళ్ళింది. పదిరోజులు పూర్తిగా గడవకముందే వసంత ఆలోచనలు అస్తమానూ విహారి దగ్గరికి పరుగులు పెట్టేవి. అందుకే ఇక అక్కడ ఉండలేక ఊరి నుండి వచ్చిన అక్కా, బావా మరి నాలుగు రోజులుండమని బలవంతపెట్టినా వినకుండా అప్పటికప్పుడు ప్రయాణమై వచ్చేసింది. రాత్రంతా రైల్లో తనని చూడగానే విహారి ఎంత ఆవేశంతో, ఆనందంతో స్పందిస్తాడోనని ఆలోచనలు చేసింది!

వసంతను చూడగానే విహారి "ఉత్తరం రాయలేదేం, స్టేషనుకు వచ్చేవాడిని కదా!" అన్నాడు. "అనుకోకుండా బయలుదేరాను. అంతా ఇంకా నాలుగురోజులైనా ఉండమని బలవంతపెట్టారు కానీ మీరు ఒక్కరూ ఇబ్బందిపడుతుంటారని చెప్పి వచ్చేశాను" అంది.

"పోనీ ఉండకపోయావా!" అన్నాడు యథాలాపంగా. వసంతకి ఉండటం ఇష్టమైనా తను ఇబ్బంది పడతాడని కదా వచ్చేసిందనే ఉద్దేశంతో అన్నాడు. కిందపెట్టిన సూట్‌కేస్‌ను తీసుకుని మళ్ళా వెంటనే వెనక్కి వెళ్ళిపోవాలన్నంత కోపం వచ్చేసింది వసంతకు.

"నిజమే ఉండాల్సింది. ఇక్కడ నాకోసం ఎదురుచూసేవాళ్ళెవరూ లేరని తెలియక ఆరాటంగా పరుగెట్టుకు వచ్చేశాను. పొరపాటు చేశాను". వసంత గొంతు గద్గదమైంది.

విహారికి చిరాకు వచ్చేసింది. తనేమన్నాడని అంత ఫీలవుతోంది! "ఎదురు చూడటమంటే ఏం చేయాలేం? నువ్వొచ్చేవరకూ గుమ్మంపట్టుకు వేళ్ళాడుతూ ఉండాలా? మనసులో ప్రేమ ఉండటం ముఖ్యంకాదు, నీకు డ్రామా, డైలాగులూ కావాలి!" కోపంగా అంటూ పక్కగదిలోకి వెళ్ళిపోయాడు.

వసంతకి కళ్ళమ్మట నీళ్ళువచ్చేసాయి. తనకి కోపం వస్తే అతనూ కోపంగా అరుస్తాడేతప్ప కోపం పోగొట్టటానికి నాలుగు మాటలు లాలనగా చెప్పడు.

"అవును నిజమే నాకు డ్రామా కావాలి, డైలాగులు కావాలి! కొంతయినా డ్రామా లేకపోతే ఆ జీవితం డ్రైగా అయిపోతుంది. అది తెలుసా మీకు"? అరిచి చెప్పాలనిపించింది.

మనసులో ఓ మూల మూటకట్టి ఉంచిన ప్రేమవల్ల ఏం ప్రయోజనం? ప్రేమ ఉండగానే సరిపోదు. ఆ ప్రేమ మాటలో, చూపులో, చేతలో అన్నింటా తేనె సోనలా జాలువారాలి! అపుడే ఆ ప్రేమానుభవం, ఆ తీయదనం మనశ్శరీరాలకు అందుతుందీ... అలరిస్తుందీ! ఆర్భాటంగా ప్రదర్శించే ప్రేమ అసహజంగా అనిపించవచ్చు. అలాగని అసలే కనబడనీయకపోతే ఎలా? దేనికైనా సమతూకం ఉండాలి.

మనసుకలవని మాటలకు విలువ ఉండకపోవచ్చు. కానీ మాటలేలేని జీవితం పూలులేని తోటలా వెలవెలపోతుంది! మనసారా చెప్పుకునే మాటలే మల్లెపూల తోటలై సంసార జీవితానికి

నిత్యవసంత శోభని కలుగజేస్తాయ్! మాటలమధురిమలూ, సరదాల సరిగమలూ పలకని సంసారగీతం ఏమంత శ్రావ్యంగా ఉండదు!

అలా తన ఆలోచనలన్నీ ఆ పుస్తకంలో రాసుకుందప్పుడు. ఉదయం లేవగానే వసంతకు కళ్ళు మంటలుగా, నీరసంగా అనిపించిందారోజు. నెమ్మదిగా టిఫిను చేసింది. టేబుల్‌పై పెట్టి దుప్పటి ముసుగుపెట్టి పడుకుంది. కాసేపటికే బాగా చలీ, జ్వరం వచ్చేసినట్లుగా అనిపించింది. విహారి ఆఫీసుకెళ్తూ అడిగాడు "పొద్దున్నే మంచమెక్కావేంటీ? బాగాలేదా?" "అవును. జ్వరం వచ్చినట్లుగా ఉంది". ముసుగుతీయకుండానే చెప్పింది. "అయితే ఈవేళ ఆఫీసుకు కారియర్ పంపించవద్దులే. నేను బయట తింటాను. పక్కింటివాళ్ళ రామాన్ని నీకు భోజనమో, బ్రెడ్డో ఏం కావాలో తెచ్చి పెట్టమను. టాబ్లెట్ ఉందిగా వేసుకో" అన్నాడు.

"మీకు సెలవులు చాలానే ఉన్నాయని అన్నారుగా. ఈ రోజు సెలవు పెట్టకూడదూ?" "సర్లే, నేనుండి ఏంచేస్తానూ, నేనేమైనా డాక్టరునా! తగ్గకపోతే సాయంకాలం హాస్పటల్‌కి వెళ్దాం. తలుపేసుకో" అంటూ వెళ్ళిపోయాడు.

దగ్గరకువచ్చి చేయివేసి చూడలేదు. జ్వరం ఎంత ఉందో తెలుసుకోలేదు. తనకి బాగా లేకపోతే చూసుకోవాల్సిన బాధ్యత పక్కింటివాళ్ళదన్నట్లుగా వెళ్ళిపోయాడు. వసంతకు కన్నీళ్ళు జలజలారాలాయ్. తలుపేసుకోవటానికి లేచేసరికి కళ్ళు తిరిగి పడబోయింది. గోడపట్టుకుని నాలుగు నిముషాలు అలాగే నిలబడి స్థిమితపడి వెళ్ళి తలుపేసుకుని వచ్చింది.

ఈ క్షణంలో తనకేమైనా ఎవరూ పట్టించుకునే వాళ్ళు లేరు. ఆ భావం ఆమెను మరింత కృంగదీసింది. దుఃఖం పెల్లుబికి వచ్చేసింది.

డాక్టర్లయితేనే పక్కనుండాలా! దుఃఖంలో, జబ్బుతో హాస్పిటల్‌లో ఉన్న వాళ్ళ దగ్గిరకు ఎవరైనా ఎందుకు వెళ్తారూ? డాక్టర్లమనీ, వైద్యం చేయగలమనీ కాదే! కష్టంలో, బాధల్లో, తమకి నలుగురున్నారనే భావన వాళ్ళకి ఓదార్పుగా ఉంటుందనీ, ధైర్యాన్ని కలుగజేస్తుందనీ కదా! దెబ్బతగిలి ఏడుస్తున్న పిల్లవాడిని ఎత్తుకుంటే, మందువేయకుండానే సగం బాధ తగ్గి ఏడుపుమానేస్తాడు. ప్రేమగా ఎత్తుకున్న చేతుల నుండి మందుకంటే ముఖ్యమైన స్వాంతన, గారాబం అందుతుంది. పిల్లలకైనా, పెద్దలకైనా కష్టంలో అలాంటి స్వాంతన కావాలి. తనకోసం ఆరాటపడే ఆత్మీయులు ప్రక్కనుంటే, ఆ బాధ పలచనవుతుంది. బలం కలుగుతుంది.

తనకి ఏ కొంచెం నలతగా ఉన్నా అమ్మా, అక్కా ఏం కావాలో కనుక్కుంటూ, ఎలా ఉందో చూస్తూ ప్రక్కనే ఉండేవాళ్ళు. పెద్దవాళ్ళ దగ్గర్నుండి పొందిన ఆ గారాబం, లాలన విడిగా ఉంటున్న భార్యాభర్తలు ఒకరి నుండి ఒకరు ఆశించటం సహజమేకదా!

అలమారాలోని నోట్‌బుక్ తీసుకుని మంచం మీద బోర్లా పడుకుని రాయటం మొదలుపెట్టిన వసంత కొంచెం సేపటికే మనసులోని దుఃఖావేశంతో, జ్వరతీవ్రతలో నీరసం ఎక్కువై అలాగే వాలిపోయింది.

విహారి ఆఫీసుకు వెళ్తూ ప్రక్కింటి సరస్వతమ్మగార్కి ఆవిడ పనయ్యాక ఒకసారి వసంతను చూడమని చెప్పాడు. పనయ్యాక ఆవిడ వచ్చింది. వీధిగుమ్మం తలుపుతట్టితే ఎంతకీ తలుపుతీయకపోయేసరికి, వెనకవేపుకి వచ్చి బెడ్‌రూమ్ కిటికీలోనుండి చూసింది. కాళ్ళవేపు తలపెట్టి మంచంమీద వసంత బోర్లాపడుకున్నతీరూ, పక్కనే కాగితాలేవో రెపరెపలాడుతుండటం చూసేసరికి

ఆవిడకు ఏదో అనుమానం వచ్చి గొంతు తడారిపోయినట్లయింది. కీచుగొంతుతో భయం భయంగా "అమ్మాయ్, వసంతా" అంటూ నాలుగైదుసార్లు పిలిచినా పలకకపోయేసరికి ఆవిడకు కంగారెక్కువైపోయింది.

వాళ్ళబ్బాయి రామాన్ని హడావుడిగా పిలిచి విహారికి ఫోను చేయమని చెప్పింది. ఆ అబ్బాయి ఫోనుచేసి వచ్చాక ఒక గెడకర్ర తీసుకుని కిటికీలోనుండి వంటగది తలుపుగెడ తీయటానికి ప్రయత్నం మొదలుపెట్టాడు. ఏమయిందంటూ చెమటలు కక్కుతూ హడావుడిగా విహారి వచ్చేవేళకి ఆ అబ్బాయి ప్రయత్నం ఫలించి గెడవూడి వచ్చింది. ముగ్గురూ లోపలకు వెళ్ళారు.

విహారి ఆదుర్దాగా వసంతను కదిపాడు. అప్పటికి కొంచెం స్పృహలోకి వచ్చిన వసంత సన్నగా మూలిగింది. వాళ్ళని చూస్తూండమని చెప్పి పక్కవీధిలోనున్న డాక్టరు ఫ్రెండుని తీసుకురావటానికి విహారి వెళ్ళాడు. డాక్టరు వచ్చి చూసి కంగారు పడాల్సిన పనిలేదనీ, జ్వరతీవ్రతలో స్పృహతప్పి ఉండవచ్చనీ చెప్పి మందులు రాసిచ్చాడు. అప్పటికిగానీ విహారి తేలిగ్గా శ్వాసపీల్చుకోలేకపోయాడు.

సరస్వతమ్మగారు వెళ్ళాక విహారి వసంతకు మందులు ఇచ్చి, ఆమె నిద్రపోయాక అపుడు ఆ పక్కనున్న నోట్‌బుక్ ఏమిటని యథాలాపంగా చూశాడు. ఆ బుక్ తెరవగానే ఒకచోట కనపడిన వాక్యాలు అతడిని ఆశ్చర్యచకితుడిని చేశాయ్!

జీవన నేస్తమా! నా సర్వస్వమా!

ఒక్కసారి నాలోకి చూడవెందుకనీ? నా ఆశల తోటలోకి అడుగుపెట్టవెందుకనీ? నా మనసులోని మల్లెతోట మారాకు వేయనని మారాం చేస్తోంది! నిట్టూర్పుల వడగాలికి వాడిపోతోంది! దానికి మాటల తేటనీరు కావాలి! ప్రేమభావన, లాలన ఆలంబనగా కావాలి!

విహారికి మొదట ఏమీ అర్థంకాలేదు. వసంత కవిత్వం రాస్తుందా అని అనుకున్నాడు. ఆ నోట్‌బుక్ అంతా పూర్తిగా చదివేసరికి అది వసంత అంతరంగానికి అద్దమని అతనికి అర్థమైంది! చాలాసేపు తనని తాను విశ్లేషించి చూసుకుంటూ అలాగే కూర్చుండిపోయాడు. వసంత తననుండి ఏం కోరుకుంటుందో కొంచెం కొంచెంగా అవగతమైనట్లయింది.

విహారి నాలుగురోజులు సెలవుపెట్టాడు ఆఫీసుకి. సరస్వతమ్మగారూ, పనిమనిషి సాయంతో పనులన్నీ తనే చక్కబెట్టాడు. రెండురోజులకే వసంత బాగా కోలుకుంది. ఆ రెండు రోజులూ తనదగ్గరే ఉండి విహారి అన్నీ స్వయంగా చూస్తూండటం చూసి తనకేమైనా అవుతుందని బాగా భయపడినట్లున్నాడని వసంత అనుకుంది.

పొద్దున్నే వసంతకు కాఫీ తెచ్చియిచ్చి, విహారి తనూ కాఫీ త్రాగుతూ పక్కనే కూర్చున్నాడు. ఆరోజు సరస్వతమ్మగారు ఏదో అనుమానంతో చేసిన హడావుడి గురించీ, ఇంట్లోకి వచ్చి వసంతను చూసేవరకూ ఆ కాస్సేపటిలో తనెంత నరకం అనుభవించిందీ విహారి విపులంగా చెబుతూంటే వసంతకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది.

విహారి వేపు కొత్తమనిషిని చూస్తున్నట్లుగా ఆశ్చర్యంగా చూస్తూ అంది "ఏమిటి మీరు... మీరేనా ఇన్ని మాటలు చెబుతున్నారూ?"

"అహఁ! అక్షరాలా నేనే! యూనివర్శిటీలోనే కాదు, సంసారంలో కూడా గోల్డ్‌మెడల్ సాధించాలని నిర్ణయించుకున్నాను! అపుడయితే గోల్డ్‌మెడల్ కోసం రాత్రింబవళ్ళు కష్టపడి చదవాల్సి వచ్చింది.

కానీ ఇపుడయితే, నీలాంటి అమ్మాయి దగ్గర ఏనగలో నాణ్యాలతో పనిలేకుండా కేవలం మంచిమాటల వల్ల ఆ గోల్డ్‌మెడల్ కొట్టేయవచ్చని నాకు అర్థమైపోయింది! అందుకే నామాటతీరుని కొంచెం మార్చుకుందామని నిర్ణయించుకున్నాను” సరదాగా నవ్వుతూ అన్నాడు.

“అంటే... మీరు... ఆ బుక్...”

“అవును. పూర్తిగా చదివాను. కొడుకు కోసం అని నువ్వు చెప్పిన పాఠాలు పరోక్షంగా నాకేనని అర్థమైంది. నా మనసు మూలలోని పీటముడి విడిపోయింది. అందుకే ఆ ప్రేమ వరదలా ప్రవహించేస్తోందన్నమాట! నీ మనసులోని మల్లెతోట వాడిపోవటానికి వీల్లేదు. అది విరబూయాలి! ఆ పరిమళాలతో మన సంసారం గుమ్మెత్తిపోవాలి!” గమ్మత్తైన భావాన్ని కళ్లల్లో పలికిస్తూ నవ్వాడు.

జాజిపూల జల్లుకురిసి ఝల్లుమన్నట్లుగా ఉంది వసంతకు. ఎన్నాళ్ళ తనదాహమో తీరి మనసు నిండిన అనుభూతితో కళ్ళు విప్పార్చుకుని అతనివైపు చూస్తూండిపోయింది! విహారి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అనునయంగా అన్నాడు “అయినా వసంతా, భార్యాభర్తలిద్దరి మధ్యా దూరం నాలుగడుగులు ఉంటే, ఇద్దరూ చెరి రెండడుగుల దూరం జరిగి దగ్గరవ్వాలి! అవునా? అంతేకానీ ఆ నాలుగడుగుల దూరం జరిగి వాళ్ళే మనకి దగ్గరవ్వాలని ఎదురుచూడకూడదు. నా మౌనం, మాటతీరు నీకు నచ్చకపోతే మార్చటానికి నువ్వు చేసిన ప్రయత్నం మాత్రం ఏమిటి? లోలోన అసంతృప్తి పెంచుకుంటూ దూరంగా జరగటం తప్ప? నానుండి నువ్వు కోరుకునే దాన్ని సాధించి పొందగలిగే హక్కు నీకుంది కదా! సరే, అదంతా వదిలేయ్! లే, లేచి తయారవు. అలా బయటకెళ్ళివద్దాం. నీ పుట్టినరోజుని సెలబ్రేట్ చేసుకుందాం”.

“అదేమిటీ, ఈ రోజు నా బర్త్‌డేకాదుగా! అయినా నేనుపుట్టి ఎవర్ని ఉద్ధరించానని పండుగ చేసుకోవాలీ?” కొంచెం కినుకగా అంది.

విహారి నవ్వాడు. “ఎవర్నీ ఉద్ధరించకపోవటమేమిటి! నన్ను ఉద్ధరించేనట్లేగా! జీవితంలో నచ్చిన తోడు దొరకటమే మనిషికున్న అదృష్టాలన్నిటిలోకీ గొప్ప అదృష్టమన్నారు. మరి నన్ను అలాంటి అదృష్టవంతుడిని చేసిన నీ పుట్టిన రోజు నాకు తప్పకుండా పండుగే! పోనీ ఈ రోజు నీ బర్త్‌డే కాకపోయినా మన అనుబంధానికి ఓ కొత్త చిగురు పుట్టిన రోజుగా సెలబ్రేట్ చేసుకుందాం! సరేనా! ఇంతకీ నీకు ఏం ప్రెజెంటేషన్ కావాలో చెప్పూ...!”

వసంత నిలువెత్తున ఎగసిన కెరటంలా అందమైన ఆవేశంతో అతన్ని చుట్టేసి, భుజంపై తలవాల్చి, మనసున మల్లెల మాలలూగిన మధురానుభూతితో మెల్లగా చెప్పింది “ఇలాంటి ముచ్చటైన క్షణాలకంటే నేను కోరుకునే కానుకలంటూ ఏమీ ఉండవు!”.

ఈనాడు ఆదివారం. 30, జనవరి, 1994.